# లతలూ - వృక్షాలు

"మామిడిచెట్టును అల్లుకున్నదీ మాధవీ లతొకటి" తాజ్‌మహల్‌ను కవితా వస్తువుగా చాలమంది వాడుకున్నారు. షాజహాన్ ముంతాజ్‌ల ప్రణయాన్ని బసవరాజు అప్పారావుగారు మావినల్లుకుపోయిన మాధవితో పోల్చారు నాటినుంచి నేటివరకూ కవులూ కవయిత్రులూ, రచయితలూ రచయిత్రులూ కూడ స్త్రీ పురుషుల గురించి చెప్పేటప్పుడు 'లతలూ-వృక్షాలు' ఉపమానాన్ని వాడుతూనే ఉన్నారు. బహుశః ప్రాచీనమైన భావం కనుక సుస్థిరంగా నిలిచిపోయిందేమో! ఇప్పుడాలోచిస్తే అదెంత వరకూ సమంజసమనిపిస్తుంది. జంటగా పెరిగిన ఏ రెండు పోకచెట్లనో చూస్తే రామలక్ష్మణులని పేరుపెడ్తారు. ఆ పోకమానుకే తమలపాకు తీగె అల్లుకుంటుంటే సీతారామం అంటారు. పుష్పఫలభరితమైన వృక్షాన్ని చూస్తే స్త్రీభావం ఎందుకు కలగదు? అది బలసంపన్నమైనది కనుకనేమో! అబలాత్వం స్త్రీత్వానికి చిహ్నమనే భావం చాలా పటిష్టంగా నాటుకునిపోయింది కనుకనేమో కాని మారేకాలంలో భావాలు మారద్దా?

గమనిస్తే, స్త్రీ జీవితంలో నాలుగు దశలు కనపడతాయి. బాల్యంలో బాలికల సమస్యలు భిన్నమైనవి కావు. జీవశాస్త్ర దృష్ట్యానే కాకుండా, పెంపకంలోని తేడాబట్టికూడ, ప్రాయం వచ్చేటప్పటికి, అమ్మాయిల, అబ్బాయిల ఆలోచనా ధోరణులు భిన్నమార్గాలు పడ్తాయి. పదిహేనేళ్ళ నుంచి పాతికేళ్ళవరకూ నిలిచే ప్రౌఢప్రాయం స్త్రీ జీవితంలో బంగారు దశ. స్వయంప్రకాశమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకోగల దశ అది. ఆ రెండు దశాబ్దాల్లో ఎంతమంది స్త్రీలు తమ జీవితాల్లో బంగారు పంటలు

పండించుకుంటున్నారనేది విచారణీయం; జీవితంలో బంగారుపంట అనగానే బాగా డబ్బు గడించే భర్తతో, పిల్లావారితో సంసారం చేసుకోడం అన్న భావంతప్ప యింకోటి తోచడంలేదు. అవివాహితల ప్రసక్తి వచ్చినపుడు "ఆమె పెళ్ళి చేసుకోలేదు" అనడంకన్నా "ఆమెకు పెళ్ళికాలేదు" అనడం ఎక్కువ అలవాటయింది. వివాహం జీవితంలో ముఖ్యమైన మధురమైన, ఆవశ్యమైన ఘట్టం అంటూ నూరిపోసే సాహిత్య ప్రభావాన, పదిహేనేళ్ళ ప్రాయంనుంచి కన్యలు సదరు బంగారు భవిష్యత్తు గురించి తీరిగ్గా కలలు కనడం అలవాటు చేసుకుంటారు. ఆ స్వప్నాల్లో, ఇరవై ఏళ్ళవరకూ ప్రేమకు ఎక్కువ ప్రాధాన్యత వుంటే, ఇరవైనుంచి పాతికేళ్ళవరకూ పెళ్ళి ఎక్కువ చోటుచేసుకుంటుంది. దైవికంగా, అప్రయత్నంగా. నిస్సహాయంగా ప్రేమలో పడిపోయి, పరిణయంలో ప్రణయసాఫల్యాన్ని చూడగలిగే అదృష్టం కొద్దిమంది స్త్రీలకే దక్కుతుంది మన దేశంలో మంచికో, చెడుకో యింకా నూటికి ఎనభై పెళ్ళిళ్ళు తల్లిదండ్రులు,తదితరులు కుదిర్చేవిగానే వుంటున్నాయి. యిటువంటి అవకాశం ఉన్న అమ్మాయిలన్నా పగటి కలలకు అలవాటు పడకుండా కాలాన్ని సద్వినియోగం చేసుకోడం మంచిది. పాశ్చాత్య దేశాల్లోని స్త్రీలకు, మన దేశంలో ఆర్థిక కారణాలవల్ల ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యలేని కుటుంబాల్లోని అమ్మాయిలు ఆడపిల్లల సంపాదనను ఎక్స్ప్లాయిట్ (exploit) చేసె ఇళ్ళల్లోని అమ్మాయిలు తమ వివాహాల గురించి ఆలోచించక, కృషి చెయ్యక తప్పదు. తక్కిన వాళ్ళకెందుకు వచ్చిన బాధ యిది? కాలం కలిసివచ్చి ప్రేమ పెళ్ళో కుదిర్చిన పెళ్ళో ఏదో ఒకటి అవుతూంటుంది పాతికేళ్ళు వచ్చేటప్పటికి. ఇహ అక్కడనుంచి ఇంకో ఘట్టం ఆరంభం. నూటికి ఏభై మంది స్త్రీలు భరించే భర్తగారిని ఎన్ని విధాల సంతోషపెట్టడం అని తక్కిన ఏభై మంది చేసుకున్న వాడి ప్రాణాలు తోడెయ్యడం అని ప్రయోగాలు చేస్తు జీవిస్తారు. ఆ రిసర్చి సాగుతుండగానే నలభయ్యోపడి వస్తుంది తర్వాత ఇంకో దశ. భర్తమీదకన్నా, పిల్లలమీదకన్నా జారిపోతున్న యౌవనంమీద ఆసక్తి పెరుగుతుంది. అంతులేని ఆరాటంలో పారిపోయే పరువానికి కళ్ళాలు బిగించాలని శుష్క-

ప్రయత్నాలు చెయ్యడం, ఏభయ్యోపడి గడిచాక జీవితంలో అశక్తత, నీరసం ఎవరూ పిలవకుండానే చోటు చేసుకుంటాయి, దేశంలో సగం జనాభాగా ఉన్న స్త్రీల జీవితాల్లో పండే బంగారమిది!

చదువుకునే వయసులో క్రమశిక్షణ, సద్గ్రంధ పఠనం, సత్సహవాసాల విలువ క్రొత్తగా చర్చించ నక్కరలేదు. వ్యక్తిత్వానికి పునాది రాళ్ళు వేసుకునే ఆ వయసులో స్వయంకృషే కాక తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల చేయూత చాలా అవసరం. జీవితాన్ని ప్రారంభించకముందే మనచుట్టూ బ్రతుకుతున్న మనుష్యుల జీవితాలలోని వైవిధ్యం, సంఘర్షణ కొంతవరకు తిలకించాలి. మానవ జీవిత పర్యావలోకని కేవలం సాహిత్యపరంగానే ఉంటే వ్యక్తిత్వపు కట్టడం అంత నిబ్బరంగా ఉండదు. క్రింది, మధ్యవర్గాల్లోని ఆడపిల్లలు చిన్నప్పుడుకూడ కేవలం విద్యార్థినులుగానే బ్రతకలేరు. తల్లిదండ్రుల కష్టసుఖాలు, దైనందిన సమస్యలు ఆర్థిక, సాంఘిక పరిస్థితుల ఒత్తిడి వయసుతోపాటు గ్రహించగలుగుతారు. ఉన్నత కుటుంబాల్లో పుట్టిపెరిగిన ఆడపిల్లలు సంపన్న గృహిణులగానే జీవితమంతా గడపగలరనే గ్యారంటీ లేదు. ఇటువంటి అమ్మాయిలకు వివాహానికిముందే "రాటుదేలటం" అనేది ఓరియంటేషన్ లాంటిది. భరించగల తల్లిదండ్రులు కొన్నాళ్ళయినా తమ పిల్లలను ఇళ్ళకు దూరంగా హాస్టల్సులోపెట్టి చదివించడం అలవాటు చేసుకుంటే కొంతవరకైనా యీ సమస్య తీరుతుంది.

రెండోది వివాహం, వివాహం తప్పనిసరి అనుకునే వైఖరిమారి, అది వ్యక్తిగత సమస్యగా తీసుకోవాలి. ప్రేమ వివాహం అయినా, కుదిర్చిన పెళ్ళి అయినా, వివాహం ఎప్పుడూ రిస్కుతో గూడిన ఎడ్వంచరే! యీనాటి మధ్యతరగతి గృహిణి సమస్యలు విలక్షణమైనవి. క్రిందటి తరం స్త్రీలు అనుభవించిన సమిష్ఠికుటుంబం, ఏటేటా కాన్పులు, నిరంకుశుడైన భర్తలాంటి ఈతిబాధలు యీనాటి గృహిణికి తక్కువ. ఈనాటి పురుషునికి ముందుతరం వాళ్ళలాగ తీరుబడి తక్కువ. అతని జీవితంలో అన్నివిధాలా అడుగడుగునా "పోటీ" ఎదురవుతున్నది. మానసిక వికా

సానికి, ఉల్లాసానికి పదిమంది స్నేహితులు గలిగివుండడం నానాటికీ దుర్భరం అవుతున్నది. నూటికి ఎనభై పాళ్ళు స్నేహాలుగా గుర్తించే వన్నీ నిజానికి కాస్త పాతపడిన పరిచయాలు, వృత్తిరీత్యా, పలుకుబడి రీత్యా పెంపొందించుకునే కృత్రిమ బంధాలుగా తేలిపోతున్నాయి. యీ రోజుల్లో భార్యకు భర్త, భర్తకు భార్యనుమించి సన్నిహితులైన స్నేహితులుండే అవకాశం సన్నగిలుతోంది. దీనికి ఇంకో కారణం విద్యావతియైన గృహిణి భర్త మానసిక జీవితంలోకూడ పాలు పంచుకో దగిన అర్హతను సంపాదించుకొనడమే. ఇది సంతోషించవలసిన విషయం. ఇటువంటి సన్నిహితత్వానికి విద్యార్హతేకాక, 'అర్థంచేసుకోవడం', అందుకావలసిన 'మనసు వుండడం' ఎక్కువముఖ్యం. అన్ని సమస్యలూ కలబోసుకుని జీవించడం- అక్షరాలా సహజీవనం - దంపతులకు తప్పనిసరి అయింది. ఆదర్శం స్థాయిలోంచి దిగి సాధారణమైంది- మధ్యతరగతి గృహస్థుకు ఆర్థిక సమస్య ఆనాడూ ఈనాడూకూడా ఉంది. భర్త ఎడల సానుభూతిగల గృహిణికి ఆర్థికంగాగూడ భర్తకు చేయూత నివ్వాలన్న వాంఛ సహజమైంది. ముందుతరం స్త్రీలు "సంసారంలో పొదుపు" గురించి తప్ప వేరే ఆలోచన లేకుండా బ్రతకడం, లేదా పుట్టింట్లో పోట్లాట పెట్టుకునో, దేవురించే సంభారాలు చేరవేసుకోడంతో భర్తలకు ఆర్థిక సహాయాన్ని చేస్తుండేవారు. ఆధునిక యువతి అవకాశం, సౌకర్యం వుంటే, పిల్లలను మూడేళ్ళ వయసునుండే స్కూళ్ళకు పంపే అలవాట్లు- యిత్యాది కారణాలవల్ల సంసార జీవితం ప్రారంభించిన ఆరేడేళ్ళకల్లా గృహిణికి 'తీరుబడి' కలుగుతోంది. చదువుకున్న యువతులకు పొరుగిళ్ళకు కబుర్లాడానికివెళ్ళే అలవాటుండదు. నాగరికత పుణ్యాన, చెప్పకుండా వచ్చే స్నేహితులు, పిలవకుండా వచ్చే బంధువులు తగ్గిపోతున్నారు. యీ పరిస్థితుల్లో గృహిణికి రోజంతా ఎట్లా గడవడమనేది ఒక సమస్య అవుతున్నది. సృజనాత్మక శక్తి గలవారు ఇళ్ళదగ్గరఉన్నా తమకాలాన్ని సద్వినియోగం చేసుకోగలరు. స్త్రీ సామాన్యానికి సాధ్య

మయేది కాదిది. లేకపోతే చీరలు, నగలు, ప్రేమాయణాలు, లేచిపోవ దాలు గురించి చర్చలే వారి జీవితాన్ని ఆక్రమిస్తాయి. "తల్లిదండ్రుల కెదురు చెప్పలేక ప్రేమించిన అమ్మాయిలను నిరాకరించే యువకులను చులకనగా చూడ్డం ఎట్లా అలవాటు చేసుకున్నామో, ఆ విధంగానే "తీరిక వేళలో చదివి పరీక్షకు కట్టాలనే వుంటుంది కాని మా వారికి నచ్చదు. నేను ఉద్యోగం చెయ్యడానికి మా వారు ఒప్పుకోరు" అనే స్త్రీలనుకూడ చులకనగా చూడ్డం అలవాటు చేసుకోవాలి. యీ రెండు పనులు చెయ్యలేక పోవడానికి అసమర్థతకన్నా, బద్ధకమే ఎక్కువ కారణంగా కనిపిస్తుంది. బద్ధకస్తులను బ్రహ్మకూడ బాగుచెయ్యలేడు. డబ్బు సమస్య యింటిపనులూ బాధించని సంపన్న గృహిణులు ముఖ్యంగా నిష్ప్రయోజనమైన జీవితాలు గడిపేస్తు వుంటే, ఎన్ని 'వుమన్ అవర్స్' వృధా అయిపోతున్నాయో తలచుకుంటే వ్యధ కలుగుతుంది. ఆధునిక యువతి ధ్యేయం భర్త ప్రక్కన భార్యగాని, భర్తచాటు భార్యకాదు. ఆ లక్ష్యసాధనలో లతలు.. వృక్షాలు వుపమానాన్ని మర్చిపోవడం మంచిది.

—o—